



మాట్లాడుతున్న సీఎం రేవంత్

షాద్‌నగర్‌ను అభివృద్ధి చేసి చూపిస్తా

నియోజకవర్గంలో చేయాల్సిన పనులన్నీ పూర్తి చేస్తా

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెనుకబడిన విద్యారంగం
- లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మించకుండా నిధులు దోచేసిన కేసీఆర్
- కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

9



సభకు హాజరైన జనం



వేంకటేశ్వరాలయం పునర్‌వైభవానికి కృషి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, అక్టోబరు 11 : వెంకటేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్వామివారి బ్రహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వర స్వామిఆలయంలో బ్రహోత్సవాల సమయంలోనే వికారాబాద్ వెంకటేశ్వరాలయంలో వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నారుల సాంస్కృతి కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అంతేకాకుండా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి వికారాబాద్ జిల్లా ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ దసరా పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వర్క్‌బిల్లును వ్యతిరేకిద్దాం

- కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

వికారాబాద్, అక్టోబరు 11 : వర్క్‌బిల్లును అందరూ వ్యతిరేకించాలని, ఈ విషయంలో కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేటలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ జల్సా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని, ఆయన అందరికీ ఆదర్శనీయమన్నారు. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. పాలస్తీనియన్ల పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని, ఇప్పటికే 40 వేల మంది మృతి చెందారని, అయిన వారు ఎక్కడ వెనుకడుగు వేయకుండా ధైర్యంతో పోరాడుతున్నారన్నారు. ఇజ్రాయిల్ తన ఆగడాలను మానుకోవాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ఖురాన్ పఠించాలని, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంఐఎం ముఖ్య నాయకులు, మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

విజయదశమికి ఏర్పాట్లు



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ అశోక్, అధికారులు

పరిగి, అక్టోబరు 11: విజయదశమి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్‌లు పరిశీలించారు. ప్రజలు షమీ పూజలు నిర్వహించే లక్ష్మీవెంకటేశ్వరస్వామి పరిసరాల్లో శుభ్రం చేయించారు. చెత్త, కలుపు మొక్కలను తొలగింపజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్వర్, భాస్కర్ పాల్గొన్నారు.

మూడు ఏఈవో పోస్టులు ఖాళీ

తాండూరు రూరల్, అక్టోబరు 11: ఉద్యోగులు బదిలీల నేపథ్యంలో మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఈవో పోస్టులు ఖాళీ అయ్యాయి. మండలంలో ఏడు అగ్రికల్చర్ క్లస్టర్లు ఉన్నాయి. నారాయణపూర్ క్లస్టర్ ఏఈవో శిరీష, సిరిగిరిపేట్ ఏఈవో పర్వీన్‌బేగం, చెంగోల్ క్లస్టర్ ఏఈవో దుర్గాదేవిలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఆయా రైతు వేదికల్లో ఇన్‌చార్జిలు పనిచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్నచోట్ల రెగ్యులర్ ఏఈవోలను నియమించాలని రైతులు కోరుతున్నారు.

16న ఓగీపూర్‌లో సర్వే

తాండూరు రూరల్, అక్టోబరు 11 : మండల పరిధిలోని ఓగీపూర్‌లో సర్వే నంబర్-65లో వివాదాస్పద నాపరాతి గని భూమికి సంబంధించి ఈ నెల 16న సర్వే చేస్తామని మైనింగ్ ఏడీ సత్యనారాయణ శుక్రవారం పేర్కొన్నారు. సర్వేకు గనుల శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ హాజరవుతారని తెలిపారు. మైనింగ్, రెవెన్యూ సర్వేయర్లతో ఈ భూమిని సర్వే చేస్తామన్నారు.

జెండావిష్కరణ వివాదానికి తెర



గ్రామస్తులతో చర్చిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 11: దసరా పండుగ నాడు గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరణ విషయంలో పూడూరులో ఐదేళ్లుగా కొనసాగుతున్న రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న వివాదానికి పోలీసులు, అధికారులు తెరదించారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ శైలజ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిలు రెండు రోజులు రెండు వర్గాలతో జరిపిన చర్చించారు. శుక్రవారం చర్చలు ఫలించాయి. దసరా రోజు ఆనవాయితీగా జెండా ఎగరవేస్తున్న కుటుంబ సభ్యులకు ఈ దసరా చివరి సారి జెండా ఎగరవేసే అవకాశం కల్పిస్తూ అంగీకారాన్ని కుదుర్చుకున్నారు. భవిష్యత్తులో దసరా రోజు జాతీయ జెండాను ఎగరవేసే బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధికి లేదా అధికారులకు ఉంటుందని తేల్చి చెప్పారు. ఒకే కుటుంబానికి చెందిన వారు జెండా ఎగరవేసే సంప్రదాయానికి స్వస్తిపలుకుతూ అధికారుల సమక్షంలో గ్రామస్తులు ఒప్పంద పత్రం రాశారు. ఆ పత్రాలను అధికారులకు అందజేశారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించిన పోలీసులకు, అధికారులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వింగర్-ట్రాక్టర్ ఢీ.. వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, అక్టోబరు 11: ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లిలోని యూనిక్యు బయోటెక్ కంపెనీకి చెందిన వింగర్ వాహనం ఉద్యోగులతో హైదరాబాద్ నుంచి తుర్కపల్లిలోని ఫ్యాక్టరీకి వెళ్తోంది. వింగర్ డ్రైవర్ వేగంగా, అజాగ్రత్తగా నడిపి ముందు వెళ్తున్న ట్రాక్టర్(టీఎస్07 యూడీ0535) ట్రాలీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వింగర్ ముందు భాగంలో కూర్చున్న బేగంపేట్‌కు చెందిన ఎవలిన్(31) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీ

కీసర రూరల్, అక్టోబరు 11: ఓ కిరాణ దుకాణంలో దొంగలు భారీ ఎత్తున నగదు, సామగ్రిని ఎత్తుకెళ్లారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కీసరలోని శివాజీనగర్ కాలనీలో అలా అస్గర్ అనే వ్యక్తి కిరాణ దుకాణం నడుపుతున్నాడు. గురువారం రాత్రి దొంగలు దుకాణం షటర్‌ను ధ్వంసం చేసి 5.23లక్షల నగదు, రూ.4లక్షల విలువైన సిగరెట్ ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల వైర్లు కట్‌చేసి, డీవీఆర్‌ను ఎత్తుకపోయారు. చోరీపై అలా అస్గర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని క్రైమ్ ఎస్సై వెంకట్‌నారాయణ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

ధారూరు, అక్టోబరు 11: బైక్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం హరిదాసుపల్లి గేట్ సమీపంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాంపూర్ తండాకు చెందిన సబావత్ ధారాసింగ్, తరణ్ బైక్‌పై వికారాబాద్ వైపు వెళ్తున్నారు. హరిదాసుపల్లి గేట్ సమీప బంక్‌లో పెట్రోల్ కోసం వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో ధారాసింగ్, తరణ్‌లకు గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్సులో వికారాబాద్ అసుపత్రికి తరలించారు. పెద్దేముల్‌కు చెందిన మీర్జా హుమార్ కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడమే ప్రమాదానికి కారణం అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో డ్రెయిన్‌లో పడి వ్యక్తి మృతి

పరిగి,అక్టోబరు 11: తాగిన మైకంలో ఓ వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందాడు. పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్యాట చంద్రయ్య(42) కొన్నేళ్ల క్రితం భార్య వదిలివెళ్లడంతో తల్లి బాలమ్మ వద్ద ఉంటున్నాడు. భార్య లేకపోవడంతో బరువు బాధ్యత పట్టించుకోకుండా ఒంటరిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 98న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చంద్రయ్య కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం గ్రామ మురుగు కాలువలో స్లాబ్‌కింద చంద్రయ్య మృతదేహం కన్పించింది. మద్యంమత్తులో పడి ఉంటాడని భావిస్తున్నారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.



చంద్రయ్య మృతదేహం



చంద్రయ్య(ఫైల్)

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



పల్లకి సేవలో శుభప్రద్ పటేల్, భక్తులు

వికారాబాద్, అక్టోబరు 11:దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. శుక్రవారం అనంతపద్మనాభస్వామి గరుడ సేవలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు పూజల్లో కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, కిరణ్‌పటేల్, పావనిశేఖర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రామస్వామి, నాయకులు శంకర్, కేదార్నాథ్, మోహన్‌గౌడ్, గ్రామస్తులు బస్వలింగం, జి.రాములు, శ్యాంరెడ్డి, శరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, విజయ్, గంజ్ అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.

'ఆమోదం లేని కాగితాలతో ప్రజలను మోసగించిన రోహిత్‌రెడ్డి'

తాండూరు, అక్టోబరు 11: ఐదేళ్ల పాటు ప్రజలను మోసం చేసిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించినా ఆయనకు బుద్ధిరాలేదని కాంగ్రెస్ నాయకులు ధారాసింగ్, రవిగౌడ్‌లు శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. రోహిత్‌రెడ్డి తెచ్చిన జీవో కాపీలకు ఆర్థిక శాఖ ఆమోదమే లేదని తెలిపారు. ఇప్పుడు వాటితో ఏ పనీ కావడం లేదని, ఉత్తుత్తి జీవో కాపీలతో ఎంతో చేసినట్టు. కోట్లాది రూపాయలు మంజూరు చేయించినట్టు ప్రజలను భ్రమింపజేశారని ఆరోపించారు. ఓటమి నుంచి ఇంకా తెరుకొని రోహిత్‌రెడ్డి.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. తాండూరు చిలకవాగు ప్రక్షాళనకు మనోహర్‌రెడ్డి నిధులు తెచ్చడని గుర్తుంచుకోవాలన్నారు. 2018లో తాండూరుకు ఈఎస్ఐ ఆసుపత్రికి ప్రభుత్వం సిద్ధమైనా రోహిత్‌రెడ్డి చేతకాని తనం వల్లే వెనక్కి వెళ్లిందన్నారు. మచ్చలేని నేత బుయ్యని బ్రదర్స్ ప్రజలకు అందుబాటులో ఉండి నిస్వార్థ సేవలు చేస్తుంటే జీర్ణించుకోలేకే ఆరోపణలు చేస్తున్నారని ప్రకటనలో వారు మండిపడ్డారు. ఇకపై ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేస్తే గట్టిబుద్ధి చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం

- సమీకృత గురుకులాల ఏర్పాటు హర్షణీయం
- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



సమీకృత గురుకులాలకు భూమి పూజ నిర్వహిస్తున్న గురునాథ్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు, నాయకులు

కొడంగల్, అక్టోబరు 11: అభివృద్ధిలో రాష్ట్రంలోనే కొడంగల్‌ను మోడల్‌గా తీర్చిదిద్దడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. విద్యార్థులకు దసరా కానుకగా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కొడంగల్ పట్టణ పరిధి పాత కొడంగల్ శివారులో యువ భారత్ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంతనాయక్, ఈఈ శ్రీధర్‌రెడ్డిలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్ఠపర్చేందుకు సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ గురుకుల పాఠశాలల్లో అన్ని వర్గాల విద్యార్థులను చేర్చుకుంటారని తెలిపారు. 20ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టి ప్రతీ తరగతిలో డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్‌లు, లైబ్రెరీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రద్ధ వహిస్తూ ఉన్నతాధికారులతో విద్యా కమిషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఉమేశ్, డీఎస్‌సీ డబ్ల్యూవో మల్లేశం, డీటీడబ్ల్యూవో హనుమంతరావు, బీసీడబ్ల్యూవో ఉపేందర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాంనాయక్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు, కౌన్సిలర్ శంకర్‌నాయక్, ప్యాక్స్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, సయ్యద్ అంజద్, శ్రీనివాస్‌రెడ్డి, నయీమ్, దాము, రెడ్డి శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ వెలకట్టలేనిది



దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

ఘట్‌కేసర్, అక్టోబరు11: మున్సిపల్ సిబ్బంది శ్రమ వెలకట్టలేనిదని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం ఆమె తన సొంతంగా 155 మంది మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది నిరంతర శ్రమతోనే పట్టణ ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. కార్మికులు పట్టణంలో పేరుకున్న మురికినంతా రోజూ శుభ్రం చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రజలంతా ఇళ్లకే పరిమితమైన సమయంలో అన్ని పనులు చేసింది కార్మికులేనన్నారు. మున్సిపల్ సిబ్బంది నిరంతర శ్రమ వల్లే మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో రెండు సార్లు క్లీన్ సీటీ అవార్డులొచ్చాయన్నారు. కార్యక్రమంలో దేవేందర్, సిరాజ్, సంజీవరెడ్డి, ఆంజనేయులు, ధర్మేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమమే ధ్యేయం

ఘట్‌కేసర్, అక్టోబరు 11:మున్సిపల్ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వాహన, ఆయుధపూజ కార్యక్రమాలు నిర్వహించారు, అనంతరం 172 మంది సిబ్బందికి దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె తదితర వస్తువులు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో మున్సిపల్ సిబ్బందికి ఏలోటూ రాకుండా చూసుకున్నామన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. వారు ప్రజలకు మెరుగైన సేవలందించారని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు సాయిరెడ్డి, హరిప్రసాద్‌రావు, బాల్‌రెడ్డి,రవీందర్, మేనేజర్ అంజన్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ అక్రంఅలీ, నాయకులు పాల్గొన్నారు.



పోచారంలో మున్సిపల్ సిబ్బందికి దుస్తులు, సామాన్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ చైర్మన్, పీపీలకు సన్మానం



కొడంగల్, అక్టోబరు 11: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్‌రెడ్డిలను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురారి వశిష్ట ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రాజేందర్, జయతీర్థచారి, మునీర్, భీమారాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పరిగి, అక్టోబరు 11:మిట్టకోడూరు జడ్పీస్కూల్ 2008-09బ్యాచ్ టెన్త్ విద్యార్థులు శుక్రవారం సమ్మేళనాన్ని జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు బోధించిన గురువులు విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, మంజుల, శైలజ, పి.మాణిక్యం, వీరప్ప, నర్సింహులు, భాగ్యలక్ష్మిలను సన్మానించారు.పూర్వవిద్యార్థులు శ్రీనివాస్, గోవర్ధన్, జగదీశ్వర్, నర్సింహులు, మహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న మిట్టకోడూరు పూర్వ విద్యార్థులు

పేకాట రాయుళ్ల అరెస్ట్

కీసర రూరల్, అక్టోబర్ 11: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన శుక్రవారం నాగారంలో చోటుచేసుకుంది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నాగారం, పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు పేకాట ఆడుతున్నారు. తాము దాడిచేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, రూ. 3.42లక్షలు, 8ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మేడ్చల్ టౌన్, అక్టోబరు 11: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనలు మేడ్చల్ మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో పని చేసే బహదూర్‌పల్లికి చెందిన జగన్నాథ్ సాహూ(40) శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా బాసురగడి సమీపంలో వెనుక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొంది. దీంతో సాహూ తల పగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఘటనలో డబిల్‌పూర్ శివార్లలోని 44వ జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. వ్యక్తి శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయసు 35-40సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఈ రెండు మృతదేహాలను పోస్టుమార్టం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వేర్వేరు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.


బాసిరగడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాహూ

తల్లి, ఇద్దరు పిల్లల అదృశ్యం

బషీరాబాద్, అక్టోబరు 11: తల్లి, ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైన సంఘటన బషీరాబాద్ మండలం పర్వ్యానాయక్ తండాలో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్ఐ ఎంఏ.గఫ్ఫార్ తెలిపిన వివరాల ప్రకారం .. తండాకు చెందిన చౌహాన్‌లక్ష్మి(28) తన ఇద్దరు పిల్లలు సరిత(12), జగన్(9)లతో కలిసి గురువారం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో ఆమె తల్లి బంధువులు తెలిసిన వాళ్ల ద్వారా వెతికినా ఆచుకీ లభ్యం కాలేదు. భార్య, భర్తల మధ్య గొడవ జరిగే తల్లి, ఇద్దరు పిల్లలతో ఇంటినుంచి వెళ్లిపోయిందని లక్ష్మీత టల్లి లల్లీబాయి తెలుసుకొని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అదృశ్యమైన చౌహాన్‌లక్ష్మి


అదృశ్యమైన పిల్లలు సరిత, జగన్

షాద్‌నగర్‌ను అభివృద్ధి చేసి చూపిస్తా

రంగారెడ్డి అర్బన్/షాద్‌నగర్/చౌదరిగూడ, అక్టోబరు 11 : షాద్‌నగర్ అభివృద్ధి బాధ్యత తనదని, ఈ నియోజకవర్గంలో చేయాల్సిన పనులన్నీ పూర్తిచేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గులో రూ.120కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజవర్గ అభివృద్ధికి తయారు చేసిన జాబితా చాలా పెద్దగా ఉందని, ప్రస్తుతం దానిని చదవలేనని, ఇంటికి వెళ్లాక పరిశీలిస్తానని అన్నారు. షాద్‌నగర్ అంటే తనకు ప్రేమ అని... ఎమ్మెల్యే ఇచ్చిన జాబితా ప్రకారం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రజకుడైన వీర్లపల్లికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చానని, షాద్‌నగర్ ప్రజల తమ ఆశీర్వాదాలతో ఆయను గెలిపించారని అన్నారు. అతనికి ఓటేస్తే.. తనకు వేసినట్టేనని అన్నారు. 'వీర్లపల్లి'ని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ ఛైర్మన్‌ను చేశానని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో షాద్‌నగర్ ప్రాంతం విద్యారంగంలో వెనుకబడిందన్నారు. కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలని ఎమ్మెల్యే పట్టుబట్టాడని, అంతటితో ఆగకుండా తనను ఇక్కడికి తీసుకొచ్చారని తెలిపారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో స్కూల్ శంకుస్థాపనకు వెళ్లాల్సి ఉన్నా అక్కడికి వెళ్లలేదని, కొందుర్గుకే వచ్చానని రేవంత్‌రెడ్డి చెప్పారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును గత సీఎం నిర్మించకుండా నిధులు దోచుకున్నారని ఆరోపించారు.

షాద్‌నగర్‌కు మెడికల్ కాలేజీ ఇవ్వండి : ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌కు మెడికల్ కాలేజీ ఇవ్వాలని ఎమ్మెల్యే శంకర్ సీఎంను కోరారు. షాద్‌నగర్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వంద ఫీట్ల రోడ్డు విస్తరణకు 400ఇళ్లు కూల్చాల్సి ఉందని, ఇళ్ల యాజమానులకు రూ.25కోట్ల పరిహారం ఇవ్వాలని కోరారు. లింకు రోడ్లకు రూ.150కోట్లు ఇవ్వాలని కోరారు. నీటి అవసరాలకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లేడు చౌదరిగూడ మండలంలో వసతులు కల్పించలేదన్నారు. 57 తండాల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులివ్వాలన్నారు. కార్యక్రమంలో పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య, మండలి విప్ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఎమ్మెల్యేకు చీఫ్ విప్ సలహాలివ్వాలి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు11: ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకొని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అభివృద్ధి విషయంలో సలహాలివ్వాలని మాజీఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు మహేందర్‌రెడ్డిని నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ స్థానిక నాయకులూ ఆయనకు సహకరించడం లేదని తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బ్రదర్స్ పేరిట అక్రమాలు చేస్తున్నారని, దీపావళి తర్వాత ఈ అక్రమాలపై ఉద్యమిస్తామన్నారు. సీఎం నలుగురు బ్రదర్స్, తాండూరులో ఎమ్మెల్యే బ్రదర్స్ పేరిట కొందరు అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి తవ్వేస్తున్నారని అన్నారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రాజుగౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల సంఘం డబ్బులను పంచేందుకు ఎమ్మెల్యేకు హక్కులేదన్నారు. సమావేశంలో నాయకులు నహీం, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సలీం, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. పట్టణంలో దుర్గామాతకు మాజీ ఎమ్మెల్యే పూజలు చేశారు.


స్వామికి గరుడవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనంతుడికి గరుడ వాహన సేవ

- పట్టు వస్త్రాలు సమర్పించిన కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 11: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరుడవాహనంపై స్వామి వారిని ఊరేగించగా సాయంత్రం స్వామి వారికి హంస వాహన సేవ నిర్వహించారు. చివరి రోజు శనివారం దసరా సందర్భంగా స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగించి జమ్మికట్ట వద్దకు తీసుకెళ్లి అక్కడ రావణదహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కాగా శుక్రవారం గరుడసేవలో మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి పల్లకీసేవలో పాల్గొన్నారు.

CHANGE OF NAME

It is for general information that I, BHOOMIKA NEEL PATEL Alias C BHOOMIKA D/o CHUNILAL MOHANBHAI LODARIYA and EX. W/o NEEL HARISHKUMAR PATEL, R/o 501 5th Floor Plot No-36, Sai Akhil Arcade, Manikonda, Lakshmi Swamy Nagar, K.V. Rangareddy, Telangana-500089, declare that I got divorce from my Ex.husband. And name of my father has been wrongly written CHUNILAL PATEL CHANNIYARA in my passport, the Actual Name of my Father is CHUNILAL MOHANBHAI LODARIYA. Also i have changed my name to BHOOMIKA CHUNILAL LODARIYA.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Smt. Palepally Farzana Begum W/oPalepally Hamid MiyaR/oBantwaram, Bantwaram, Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART-1 DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that thebearing H.NO:17-2036 in Admeasuring 230 sq. yds, Situated at Marpally Village, Marpally Mandal, Vikarabad Dist. And Bounded; **North:** Road.**South:** Open Place of Masthan. **East:** Open Place of Harun Rasheed.**West:** Open Place of Shaik Jaffar. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he/she/they may contact the undersign with document proof substantiating his/her/their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/-K SRINIVAS RAO,
C.KAPILDEV
Advocates,
Off:4-7-226/109, Sakethnagar
Vikarabad, Vikarabad. Dist-501101, PH: 9246362213; 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Sri.Jameel Ahmed S/o Pashumiya R/o Kothagadi, Vikarabad, Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property

PART-1 DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the Open Place in Sy.No.299/2 in Admeasuring 120.33 sq. yds, Situated at Kothagadi Village, Vikarabad Mandal, Vikarabad Dist. And Bounded; **North:** Narayanpur Road. **South:** Open Place of Shafiuddin. **East:** C.C Road.**West:**Grave Yard & Open Place of Begari Shankaraiah. My client if any person./Institution if having objections, claims interest disputed for the above, intended transaction he/she/they may contact the undersign with document proof substantiating his/her/their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/-K SRINIVAS RAO,
C. KAPIL DEV
Advocates,
Off:4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad. Dist-501101,
PH: 9246362213; 9603019574.